# పాపం రంగడు

అప్పుడే చీకటి పడింది. వీధి దీపాలు డిమ్ముగా వెలుగుతున్నాయి. కాంట్రాక్టరు దగ్గర పన్జేజి వచ్చిన రంగడు స్నానం ముగించి, లుంగీ కట్టుకుని, గోడకి తగిలించి వున్న అద్దం ముందు నిల్చుని తలదువ్వుకుంటున్నాడు. అద్దంలో తన మొహం చూసుకొని ఆశ్చర్యపోయాడు. తన మొహంలో ఇంత సౌమ్యత వుందా? అనుకున్నాడు మనసులోనే.

ఇరవై రోజుల క్రితం వరకు రంగడి పేరు చెబితే అందరూ భయపడేవారు. అతడురోడ్డు మీంచి వెళ్తూ వుంటే, ఎవ్వరూ పలకించేవారు కాదు. మొహాలు దించుకుని పోయేవారు. అతడితో పరిచయాలున్న వాళ్ళు సహితం, అతణ్ణి చూసి మౌనంగానే సాగిపోయేవాళ్ళు. అటువంటి వ్యక్తితో మాట్లాడ్డం, అందరికీ భయంగానే వుండేది. రంగడి మిత్రులు, సహచరులు అతణ్ణి 'రంగా దాదా' అని సంభోధించేవారు. అదొక బిరుదులా భావించే వాడోయేమో లోలోనే మురిసిపోతూ గర్వపడేవాడు, రంగడు.

గతంలో రంగడు యెన్నో దౌర్జన్యాలకి పాల్పడిన వ్యక్తి ! దొంగతనాలు చేశాడు. దారికాచి, జనాన్ని దోచుకున్నాడు. సహజంగా పిరికివాళ్ళయిన వ్యక్తుల్ని బెదిరించి, అవసరమైనపుడంతా వార్నించి డబ్బు గుంజేవాడు. అడిగిన వెంటనే ఇవ్వనివాళ్ళని, శారీరకంగా హింసించో, చంపుతానని భయపెట్టో డబ్బు వసూలు చేసేవాడు. అందుకే, రంగడంటే వర్తకులకి సింహస్వప్నమే. ఎన్నోసార్లు కటకటాల వెనక్కి వెళ్ళాడు. అయితే వెంటనే బైటకొచ్చేసేవాడు.

ఇక్కడ మరో విషయం కూడా చెప్పుకోవాలి. ఈ అక్రమాలన్నీ ఒక్క రంగడే చెయ్యలేదు. అతడికి చిన్న ముఠా వుండేది. ఆ ముఠాలో పదిపన్నెండు మంది చిన్న, పెద్ద రౌడీలుండేవారు. వారిలో నారాయణ, నాయుడు రంగడంతటి సమర్థులే. అయినా సరే వాళ్ళిద్దరూ రంగడి మాటకి విలువిచ్చేవారు. రంగడి నాయకత్వాన్ని ఏకగ్రీవంగా అంగీకరించిన వాళ్ళే.

అటువంటి చరిత్రగల రంగడు హటాత్తుగా మారిపోయాడు. ఎవ్వరూ నమ్మలేని విధంగా మారిపోయాడు. రౌడీ జీవితానికి స్వస్తి చెప్పి సమాజంలో గౌరవంగా నలుగురితో పాటు బతకాలని నిర్ణయించుకొని మారాడు. మొదట్లో ఎన్నో ఇక్కట్లకు ఎదురు దెబ్బలకు గురయినా లెక్కచేయకుండా

క్రమంగా వాటని ఓర్పుతో సహించి అధిగమించాడు. ఎంతో ప్రయత్నం మీద, ఒక కంట్రాక్టర్ దగ్గర రోజూ కూలీకి పని చెయ్యడం ప్రారంభించాడు. ఆ ఉద్యోగంలో శ్రమ ఉన్నా జీవితంలో ఎంతో హాయి, తృప్తి ఉన్నట్టనిపించింది రంగడికి. భోగలాలసమైన రౌడీ జీవితాన్ని అనుక్షణం భయంతో, ఆరాటంతో గడపటం కంటే ఇప్పటి కూలీ జీవితాన్ని నిశ్చింతగా, నిర్భయంగా, సంతృప్తిగా గడపడమే అతడి దృష్టిలో ఉత్కృష్టమైనదిగా తోచింది. గతం తల్చుకుంటే గగుర్పాటు కలిగింది. అటువంటి జీవితం కొన్నాళ్ళయినా నడిపినందుకు జుగుప్స కలిగింది. పశ్చాత్తాపం అతని గుండెనిండా పరుచుకుంది.

గతంలో రంగడి ముఠాలో వుండే వ్యక్తులు, అతణ్ణి అవహేళన చెయ్యడం ప్రారంభించారు. అయినా సరే ఆవేశం తెచ్చుకోలేదు రంగడు. అతడికి తెలుసు, ఆవేశం తెచ్చుకుంటే, మళ్ళీ ఏదో తప్పు చేస్తానని, ఆ తప్పు మళ్ళీ అతని జీవితాన్ని మార్చి వేస్తుందేమోనన్న భయం వుండేది. అందుకే అంతులేని సహనాన్ని అలవర్చుకున్నాడు.

రంగడి తల్లిదండ్రులు పైడమ్మ, మల్లయ్య కొడుకులో మార్పు వచ్చినందుకు ఎంతగానో ఆనందించారు. ఈ మార్పు, ఎప్పట్నుంచో కోరుకుంటున్నారు వాళ్ళు. తల్లిదండ్రులు పొందుతున్న ఆనందాన్ని చూసి తనలో తానే మురిసిపోయాడు రంగడు. అటువంటి సంతృప్తితోనే తన మొహంలో ప్రశాంతత చోటుచేసుకుందన్న నిజాన్ని గ్రహించ గలిగాడు. మాసిపోయిన గడ్డాన్ని నిమురుకుంటూ సన్నగా నవ్వుకున్నాడు. అతని నవ్వు యెంతో అందంగా అగుపించిందతనికి. తృప్తిగా నిట్టూర్చి మంచమ్మీద కూచున్నాడు. సాయంత్రపు వేళల్లో ఎక్కడికీ వెళ్ళడమే మానుకున్నాడు. ముఖ్యంగా గతంలో తన ముఠా కేంద్రానికి.

✪ ✪ ✪

రోజులు గడుస్తున్నాయి.

రంగడి జీవితం సాఫీగానే సాగిపోతోంది. బైట చిన్న తుంపర్లు పడుతున్నాయి. ఈదురు గాలి వీస్తోంది. రంగడు, టేబిల్ ముందు కూచుని హరికేన్ లాంతరు వెల్తురులో ఏదో పుస్తకాన్ని చదువు కుంటున్నాడు. మల్లయ్య, బైట గడపమీద దుప్పటి కప్పుకుని కూచుని, ఎవరితోనో మాట్లాడుతున్నాడు. అదే గడప మీద రంగడి తల్లి వంట చేస్తోంది. అప్పుడొచ్చాడు లింగడు ఆదరాబాదరాగా.

" రంగన్న వున్నాడా మావాఁ ... ?" అన్నాడు మల్లయ్యనుద్దేశించి. అతడి ప్రశ్నలో ఆరాటం స్పష్టంగా ధ్వనిస్తోంది.

"లోపలున్నాడ్రా ఎల్లు.. ఒరేయ్ లింగా అణ్ణి మల్లా ఆ రొంపిలోకి దింపకండ్రా" అన్నాడు మల్లయ్య. కొడుకులో మళ్ళీ మార్పు వస్తుందేమోనని అతని భయం.

'అదేదీ కాదులే మావా॰ నానందుకు రానేదు. అరిజంటు పనుంది" అంటూనే లోపలికి నడిచాడు లింగడు.

లింగడు, రంగడికి విశ్వాసపాత్రుడు లింగడ్ని చూడగానే చిరునవ్వుతో ఆహ్వానించాడు రంగడు "అరే లింగా, కూచో" అన్నాడు చదువున్న పుస్తకాన్ని ఓ పక్కని పెడుతూ.

లింగడు రంగడికి అభిముఖంగా ఓ స్టూల్‌పై కూలబడ్డాడు. ఆయాసంతో రొప్పుకుంటూ 'ఏవిట్రా లింగా, అలా ఆయాసపడుతున్నావేంటి" ప్రశ్నించాడు రంగడు.

" అన్నా, నువ్వరిజంటుగా రావాలి" అన్నాడు ఆత్రంగా.

" ఏం జరిగిందిరా"

" నాయుడు, నారాయణ, కేకలేసుకుంటున్నారు, ఇద్దరూ తాగుడు మైకంలోనే వున్నారు. ఏం జరుగుతుందోనని అందరికీ భయమేస్తుంది నువ్వొస్తేనేగాని, అల్లూరుకోరు. నీమాట అల్లకి యేదవో క్యం గందా. బయల్దేరన్నా... ఆరాటంతో అన్నాడు లింగడు.

రంగడు ఆలోచనల్లో పడ్డాడు. ఆ ముఠానుంచి బైటపడి కొత్త జీవితాన్ని గడుపుతున్న తాను,మళ్ళీ అక్కడ అడుగుబెట్టడం మంచిదేనా ? అన్న సందిగ్ధంలో పడ్డాడు.

" ఏవిఁటన్నా ఆలోచిస్తున్నావు" ఆత్రంగా అడిగాడు లింగడు.

" ఒరేయ్ లింగా, మళ్ళీ అక్కడ అడుగు పెట్టాలంటే నాకెందుకో యిష్టంగా లేదురా" అన్నాడు.

'అట్ల అనకన్నా మనోల్లంతా నిన్ను తీసుకురమ్మనే నన్ను పంపించారు. నువ్వొక్కసారి రావాలి మరి" ప్రాధేయపూర్వకంగా అన్నాడు లింగడు.

అంతలోనే రంగడి తల్లి పైడమ్మ లోపలికొచ్చింది, లింగడి మాటలు విని 'ఒరేయ్ లింగా, మావోణ్ణి మల్లా ఆ తగాదాల్లోకి యెందుకు లాగుతున్నావురా ?" అంది.

"నాయుడు, నారాయణ కేకలేసుకుంటున్నారత్తా, మావోళ్ళంతా, అన్నని తీసుకురమ్మని నన్ను పంపినారు. అన్నొస్తేనే గాని, అళ్ళూరుకోరు. అన్నమాటంటే, అళ్ళకి గురుంది కదా ఈ ఒక్కసారి రానీ అత్తా" లింగడు ఆమెని బతిమాలాడు.

వాళ్ళంతా ఇప్పటికీ తన పెద్దరికానికి విలువిస్తున్నందుకు లోలోనే మురిసిపోయాడు రంగడు. అందుకే వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు.

" అలా వెళ్లొస్తానే అమ్మా..' అంటూ లేచాడు రంగడు. పైడమ్మకి మాత్రం కొడుకు అక్కడికి వెళ్ళడం యేమాత్రమూ ఇష్టంలేదు. ఆమె మొహంలో నిరుత్సాహపు భయాలు తారాడినయ్. ఓ నిట్టూర్పు వదిలింది.

"ఏటోన్నా రంగా, నువ్వు మారిపోయావని మావు(యెంతో సంబరపడిపోతున్నావా ( ? మళ్ళా అళ్ళవద్దకి యెల్తానంటావేరా? నాకెందుకో భయమేత్తందిరా" బాధపడుతూనే అంది.

రంగడు మెల్లిగా నవ్వాడు. 'భయమెందుకమ్మా, ఆళ్ళిద్దరికీ సర్దిచెప్పి ఇట్టే వచ్చేస్తాను కదా ! నువ్వేం కంగారు పడకే. ఒకసారి మారిపోయినోణ్ణి, మల్లా ఆ రొంపిలోకి దిగుతానా? ఎప్పటికీ కాదమ్మా నన్ను నమ్ము" అంటూ, షర్టు, ఫేంటు వేసుకుని బయల్దేరాడు రంగడు.

"సెప్పినా యినడు.." తనలోతానే గొణుక్కుంది పైడమ్మ.

రంగడు గదిలోంచి బైటికొచ్చి " అలా వెళ్లొస్తానయ్యా... " అన్నాడు తండ్రినుద్దేశించి.

'తొందరగా వచ్చీరొరేయ్...' అన్నాడు మల్లయ్య

"అలాగేనయ్యా..." అనేసి, ముందుకు సాగిపోయాడు రంగడు లింగడితో పాటు.

✪ ✪ ✪

రంగడు, లింగడు వెళ్ళేసరికి నాయుడు, నారాయణ, ఒకర్నొకరు నిందించుకుంటున్నారు. అప్పుడప్పుడూ తిట్టుకుంటున్నారు. ఇద్దరూ తాగి ఉన్నారని వాళ్ళ కళ్ళు, మాటలు, ఇట్టే చెబుతున్నాయి. దుమ్ములేపేస్తానని ఒకడంటూ వుంటే నేనేం గాజులు తొడుక్కోలేదని మరొకడంటున్నాడు. ముఠాలోని ఇతర సభ్యులు ఇద్దర్నీ సముదాయించడానికి విఫల ప్రయత్నాలుచేస్తున్నారు.

అది ఆ ముఠా కేంద్రంగా వుంటున్న పాడుపడిన ఇల్లు. తలుపులు కిటికీలు ఏమీ లేవు. ముఠాలోని సభ్యులంతా అక్కడే ఉన్నారు.

"నమస్తే అన్నా" అన్నారందరూ.

"నమస్తే .. నమస్తే...' అన్నాడు రంగడు.

'కూచో అన్నా...' అన్నాడు నాయుడు, నారాయణ ఒకేసారి, రంగడు కూచోలేదు.

'ఫరవాలేదు గాని, మీరిద్దరూ తగూలాడుకుంటున్నారట, ఎందుకురా ? నన్ను రమ్మని వీళ్ళంతా కబురు పంపించారు. ఇంతకీ మీ తగువెందుకు చెప్పండి" అన్నాడు లింగడు.

"మరేమీ లేదన్నా విషయం చిన్నదే. నిన్న రాత్రి దొంగతనం చేశాం. ఆ ఇంట్లో డబ్బే దొరికింది. వీళ్ళందరికీ తలా వంద ఇచ్చేశాం. అంతవరకూ బాగానే వుందన్నా. మిగిలిన వెయ్యిరూపాయల్లో నాకు మూడొందలే ఇస్తానంటున్నాడు నారాయణ. చెరిసగం కావాలంటున్నాన్నేను. నువ్వే చెప్పన్నా, ఇప్పుడీ ముఠాలో మేం ఇద్దరం సమానం కదా ! సమభాగాలుండాలంటావా, లేదా ?" అంటూ

విషయాన్ని విపులంగా చెప్పాడు నాయుడు.

నారాయణ యేం మాట్లాడలేదు. తీక్షణంగా చూస్తున్నడంతే, రంగడు ఆలోచించలేదు. ఆలోచించాల్సిన సమస్య కాదనుకున్నాడు.

" ఇప్పుడీ ముఠాకి నాయకుడెవరో తేలేవరకూ సమభాగాలే వుండాలి కదా ! నేను నాయకుడిగా వున్నప్పుడు, మీరిద్దరూ నాకు అత్యంత సన్నిహితులే. మీ ఇద్దర్నీ సమదృష్టితో చూసే వాణ్ణి. ఇద్దరికీ ఒకేలా భాగం ఇచ్చేవాణ్ణి. ఔనా ! " తన తీర్పు చెప్పాడు రంగడు.

నారాయణ అసహనంగా చూశాడు." అప్పటి సంగతి వేరు. ఇప్పుడదెట్లా అవుతుందన్నా ? నువ్వెళ్ళిపోయాక ఈ ముఠాకి నేనే నాయకుణ్ణి కదా " అన్నాడు విసురుగా.

"నువ్వెట్లా నాయకుడినవుతావు? మేం ఎన్నుకోలేదు కదా" అన్నాడు నాయుడు.

"ఇదేమి అసెంబ్లీయా ఏమిటి? బలమున్నోడే ఇక్కడ నాయకుడు" కోపంగానే అన్నాడు నారాయణ.

"అయితే బలం లేనిదెవరికి ?" అన్నాడు నాయుడు.

చివికి చివికి గాలివానలా మారిపోతుందేమో వాళ్ళ వివాదం అనిపించింది రంగడికి, అది మంచిది కాదనుకున్నాడు.

'అబ్బ ఎందుకలా కొట్లాడుకుంటార్రా ! ఇది మీ ఇద్దరికీ సంబంధించిన విషయం సామరస్య ధోరణిలో యీ సమస్యని పరిష్కరించుకోండి. అది ఇద్దరికీ శ్రేయస్కరం..' తను న్యాయం చెప్పినా, దాన్ని అంగీకరించే ధోరణిలో నారాయణ లేడని గ్రహించడానికి అతనికి అట్టే సమయం పట్టలేదు. అందుకే అలా చెప్పాడు.

నాయుడు, రంగడికేసి ఆశ్చర్యంగా చూశాడు.

"అదేవిటన్నా? నువ్వేదో న్యాయం చెప్తావని పిలిపిస్తే నువ్వూ తప్పించుకుంటున్నావా? నువ్వు చెప్పిన తీర్పుకి మేం కట్టుబడి వుండక పోతామా? చెప్పన్నా" అన్నాడు నాయుడు.

అయితే నాయుడికి తెలీని నిజం మరోటి వుంది నారాయణకి, రంగడిపట్ల గౌరవమూ లేదు. అభిమానమూ లేదు. అతడిలో వున్నదంతా రంగడి పట్ల ద్వేషమే. ఎప్పట్నుంచో ఈ ద్వేషభావం అతనిలో రగులుతూనే ఉన్నా రంగడు తమ ముఠా నుంచి విడిపోయి, మంచివాడిగా మారిపోయి, అందరి మెప్పు పొందుతూ వుండటంతో పరాకాష్టకు చేరుకుంది. రంగణ్ణి చూస్తేనే అతనికి వొళ్ళు మండిపోతోంది. అంతే కాదు -

"ఒరే నాయనా రంగడు యెలా మారిపోనాడో సూడ్రా నువ్వూ అట్లాగే మారిపోయి మంచిబతుకు

బతకరా నిశ్చింతగా వుండొచ్చు" అంటూ తల్లి యెన్నోసార్లు తనకి చెప్పడం అనుక్షణం నారాయణకి గుర్తొస్తూనే వుంటుంది. అయితే తల్లి మాటలు అతని చెవి కెక్కలేదు. భోగలాలసమైన ఈ రౌడీ జీవితాన్ని చేతులారా వదులుకోవడం ఇష్టం లేకపోయింది. రంగడు మారిపోవడం వల్లనే తల్లి తనకి సలహా ఇచ్చే అవకాశం వచ్చిందన్న ఉక్రోషమూ నారాయణలో వుంది. అందుకే రంగణ్ణి ఆ రోజు అక్కడికి రప్పించడం ఒక ఫక్క ఇష్టం లేకపోయినా మరో వేపు అతనిలో రగులుతున్న ద్వేషం తను మౌనం దాల్చడానికి దోహదం చేసింది. అతని ఆలోచనలే వేరుగా వున్నాయి. అయితే, అతని మనసులోని భావాలు నాయుడికి తెలీవు పాపం !

నాయుడి మాటలకి నారాయణ వెటకారంగా నవ్వేడు. తాగి వున్నాడేమో, అతని కళ్ళు చింత నిప్పుల్లా యెర్రగా మెరుస్తున్నాయ్.

"రంగడేం చెప్తాడ్రా నాయుడూ? పిరికిపందలా మన ముఠానుంచి పారిపోయి బానిసలా యెవడి దగ్గరో ఉద్యోగం చేస్తున్నాడు. తీర్పు చెప్పడానికి ఆడికేం అధికారం వుందని చెప్తాడు. మంచిగా బతుకుతాడట... మంచిగా! మనందర్నీ ఇలా రౌడీల్లా, దొంగల్లా తయారుచేసి, ఆడు మాత్రం 'మంచోడు' అన్న పేరు సంపాదించుకోవాలనుకుంటున్నాడు. ఛీ! పిరికి యెదవ, ఆడేం చెప్తాడు?" గుండెలో మరుగుతున్న ద్వేషం. కోపం ఆ విధంగా నారాయణ్ణించి బైటపడింది. నాయుడితో పాటు, అక్కడున్న వాళ్ళందరూ ఆశ్చర్యపోయారు నారాయణకి అంత ధైర్యం యెలా వచ్చిందా అని. తనని రెచ్చగొట్టాలని నారాయణ ఎందుకు ప్రయత్నిస్తున్నాడో, రంగడికి బోధపల్లేదు. నారాయణ అతణ్ణి కించపరుస్తూ మాట్లాడినా, ఆవేశం తెచ్చుకోలేదు రంగడు.

"నారాయణ నువ్వు నిషాలో వున్నావు. ఏం మాట్లాడుతున్నావో నీకే తెలీటంలేదు. పోనీ, నువ్వన్నట్లు నేను పిరికి వెధవనే ముఠా నుండి పారిపోయాను. నేను కాదనడం లేదు. అటువంటి నన్ను యెందుకు పిలిపించారు? మీలో మీరే పరిష్కారం చేసుకోలేకపోయారా?" స్తబ్ధుగా అన్నాడు రంగడు.

నాయుడు చప్పున కలిగించుకున్నాడు. "పోనీలే అన్నా! నారాయణ మాటల్ని పట్టించుకోకు" అంటూ సర్దిచెప్పడానికి ప్రయత్నించాడు నాయుడు.

నారాయణ నిర్లక్ష్యంగా, నిశితంగా, రంగడికేసి చూశాడు. "పెద్ద మొనగాడివని, న్యాయం చెప్పే న్యాయమూర్తివని నిన్ను పిలిపించాం. సరేనా?" వెటకారంగా అంటూనే "అసలు నీకు యేం చేతనవునూ అంట" అన్నాడు రంగడికి దగ్గరగా వస్తూ.

పరిస్థితి మారిపోతున్నందుకు లోలోన కాస్తంత భయపడ్డాడు రంగడు తాను ఇంకా అక్కడ వుండటం శ్రేయస్కరం కాదనుకున్నాడు.

" సరేలే నారాయణ! నాకేమీ చేతకాదు. నేనెందుకూ పనికిరాను.. అలాగే అనుకో, వస్తాను

మరి... నాయుడూ వస్తాన్రా" అంటూ వెళ్ళి పోయేందుకు బయల్దేరాడు.

నారాయణ అదోలా నవ్వేడు. ఆ నవ్వు క్రూరంగా వుంది. 'నిన్ను తిరిగి వెళ్ళనివ్వడానికా, పిలిపించింది ఎంత అమాయకుడివిరా రంగా" అంటూనే పేంటు జేబులోంచి కత్తి తీసి, రంగడి కడుపులో పొడిచాడు నారాయణ.

" అమ్మా" అంటూ కడుపు పట్టుకున్నాడు రంగడు.

ఉపేక్షించకుండా నారాయణ మళ్ళీ మరోసారి రంగడి పొత్తి కడుపులో పొడిచేశాడు. అప్పటిగ్గాని అతని కోసం చల్లారలేదు.

రంగడు మళ్ళీ 'అమ్మా' అంటూ కిందికి ఒరిగిపోయాడు. "మంచివాడిగా మారిపోతావా? మమ్మల్ని అందరూ హేళన చేసేలా నువ్వు మారిపోతావా? మంచిగా బతికి పేరు సంపాదిస్తావా? మమ్మల్ని వెధవల్ని చేస్తావా? ఇప్పుడు... ఇప్పుడు నువ్వు చాలా మంచివాడివి రంగా..." అంటూ మళ్ళీ పొడవ బోయాడు నారాయణ.

బావురుమంటూ నాయుడు అడ్డొచ్చాడు. " నారాయణ, యేవిట్రా నువ్వు చేసింది ? రంగడు నీకేం అపకారం చేశాడ్రా ? మనం పిల్చామని మనల్ని నమ్మి వస్తే వాడి ప్రాణాలు తీస్తావా ?" రుద్ధ స్వరంతో అన్నాడు నాయుడు.

"రంగన్నా! తప్పునాదిరా నానే సాయంగా నిన్ను తీసుకొచ్చాన్రా ఏ మొహం పెట్టుకుని, మీ అమ్మ నాన్నల ముందు నించుంటాన్రా" అంటూ భోరున ఏడుస్తూ రంగడి భౌతిక దేహంమీద పడ్డాడు లింగడు. రంగడి చావుకి తనే కారకుడున్న పశ్చాత్తాపం అతడి ఆవేదనలో నిండివుంది.

అప్పటికే ఆ బృందం సభ్యులు అందరూ చెల్లాచెదురయ్యారు. పరిస్థితి చూశాక నారాయణకి నిషా దిగిందేమో, ఓ విధమైన భయం పట్టుకుంది. తన ముఠా వాళ్ళంతా తనని అసహ్యించు కుంటారని, నిందిస్తారని నిజాన్ని గ్రహించాడు. ఏవీ పాలుపోక పెరటి వేపు పరుగు లంకించు కున్నాడు లింగడు. రంగడి తల్లిదండ్రులకు, పోలీసులకు చెప్పాలని బయల్దేరాడు.

నాయుడు కదల్లేకపోయాడు. రంగడి తలని తన ఒడిలో పెట్టుకుని, రోధిస్తూనే వున్నాడు. నారాయణ కపట కుతంత్రాన్ని ముందుగా వూహించినందుకు లోలోన యెంతో బాధపడ్డాడు. నారాయణపై అంతులేని ఆవేశం పెల్లుబికింది. అయినా ఈ పరిస్థితుల్లో నారాయణ్ణి పోలీసులకు అప్పజెప్పి రంగడి ఆత్మకి శాంతిని చేకూర్చడమే సబబుగా ఉంటుందనుకున్నాడు.

కాస్సేపటికి రంగడి తల్లిదండ్రులు వచ్చారు. ఆదరా బాదరాగా, కొడుకు కొద్ది నిమిషాల ముందే సజీవంగా తమ కళ్ళ ముందున్నాడు. ఇంతలో శవంగా మారినందుకు వారి హృదయాలు

బద్ధలయ్యాయి. శవంమీద పడి, హృదయవిదారకంగా రోదించారు. వారి ఆవేదన నాయుణ్ణి కలిచి వేసింది.

కొడుకు భౌతిక కాయాన్ని తన ఒళ్లో తీసుకుంది తల్లి పైడమ్మ. వున్న ఒక్క కొడుకు నిర్జీవంగా మారినందుకు ఆమెకి ప్రపంచం తల్లకిందులైనట్టయింది.

" ఒరే రంగా, ఆడికెలా సేతెలొచ్చాయిరా నిన్ను పొడిసీడానికి ? నువ్వు మంచోడివిగా మారి బతుకుతున్నందుకు యిదా నీకు శిచ్చ. ?" అంటూ రోదించింది. మల్లయ్య ఆవేదనకి అంతే లేదు. కాని, వాళ్ళ ఆవేదన యెవరికి వినిపిస్తోంది ? ఒక్క నాయుడికి తప్ప.

రంగడి చావు వార్త అలా అలా పాకిపోయింది చాలా మంది అక్కడ చేరారు.

ఇంతలో లింగడు పోలీసుల్ని తీసుకొచ్చాడు.

" చంపిన వాళ్లెవరో తెలుసా ?" ఇన్స్పెక్టర్ అడిగాడు.

" తెలుసు సార్ ! నారాయణే చంపి పారిపోయాడు సార్. కత్తి వాడిదగ్గరే వుంది. మేం కళ్ళారా చూశాం. మేమే కాదు. సార్... మా ముఠాలోని సభ్యులంతా చూశారు. " అన్నాడు నాయున్ని బలపర్చాడు లింగడు.

" సరే మీరిద్దర్నూ పోలీస్ స్టేషన్‌కి పదండి " అలాగే వస్తాం సార్. కాని నారాయణ వూరు వదిలి పోకుండా చూడండి సార్..' అన్నాడు నాయుడు.

' ఆ ఏర్పాట్లు అప్పుడే జరిగిపోయాయి. మీ ఇద్దరూ పదండి... అన్నట్లు కానిస్టేబుల్ శవాన్ని పోస్టుమార్టమ్‌కి పంపించు" ఆర్డరిచ్చాడు ఇన్స్పెక్టర్.

" అలాగే సార్ !" అంటూ ఆ ఏర్పాట్లలో నిమగ్నుడయ్యాడు కానిస్టేబుల్.

ఇన్స్పెక్టర్‌తో పాటు నాయుడు, లింగడు జీపులో పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళారు.

ఆ రాత్రే పోలీసులు నారాయణని వాళ్ళింట్లో పట్టుకున్నారు. కేసు నమోదయింది. నాయుడు, లింగడు ముఠాలో మిగతా సభ్యులూ అందరూ సాక్ష్యాధారాల ఆధారంగా నారాయణకి యావజ్జీవ కారాగార శిక్ష పడింది.

కాని నారాయణ ద్వేషాగ్నికి బలైన రంగడు బతికిరాడు కదా.

□□□

(సుప్రభాతం - 5.4.95)